


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

9

(సెప్టెంబర్ 27 '76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

## *చేసిన పాపాలకు పెట్టిన దీపాలు సరి*

ఈ నెలలో - సామెతలలో హాస్యం కొంత వివరిస్తాను.. వారెంతగా ఆలోచించి లోక సత్యాలను చక్కటి మాటల్లో పొదిగారో గమనించాలి! ఒక్కొక్క సామెత మీద ఒక గ్రంథం వ్రాయవచ్చు.

స్త్రీలకు స్వతంత్ర్య జీవనం అవసరమనీ, భర్తలకు తొత్తులుగా పడి ఉండడం వల్ల చాలా హీనత ఉందనీ - స్త్రీ పురుషుల ప్రతిపత్తి నశించిపోతుందనీ - భర్తకు దాస్యం చేసి బడుగులు కావడం తథ్యమని పూర్వులు గ్రహించారు. అది ఈనాడు మరింతగా రుజువై నగ్న సత్యంగా మారింది.

*కూలీ నాలీ చేసుకుని కుదురుగా ఉండకుండా మొగుణ్ణి కట్టుకుని సగమై పోయాను* - అని ఒకామె ఎంతో విలపించింది. ఇది ఏనాటి అనుభవమో! అర్ధాంగి కోరేది భర్త జీవితంలో కష్టసుఖాలు పంచుకోవడంలో, భోగభాగ్యాలు, దాన ధర్మాలు అందుకోవడంలో అర్ధాంగి కావాలనేది అసలు సూత్రం కాని - బానిస చాకిరీ చేసి శుష్కించి పోవడం కాదు. శూన్యంలోకి చూపులు పోనివ్వడం కాదు.

అందుకనే సామెతలో స్త్రీ హృదయం పలికింది - ఎక్కడో అక్కడ ఏ కూలినాలో చేసుకుని, కుదురుగా - అంటే ఒకరికి బెదరకుండా, మనస్సు చెదరకుండా, గౌరవం తరక్కుండా ఉండవలసిన దాన్ని - ఇలా పెళ్ళాడి, అతని పాదాలు పట్టుకు వ్రేళ్ళాడి - ఎంత చేసినా అతనికి తృప్తి కల్పించలేక, మనశ్శాంతి పొందలేక, తను సగం కావలసి వస్తుందని ఎంతో విలపించింది. అలా భర్తల పరంగా, శాంతిని, పోగొట్టుకుని, బలహీనులైనవారికి ఆనవాలుగా ఈ సామెత వెలిసింది.

ఆడవాళ్ళు అందరూ వంటలో మునిగి ఉండటం, ఇంటెడు చాకిరీ చెయ్యడం మామూలే! నిజంగా వారెంతో అవస్థపడితేగానీ అందరి కడుపులూ నిండవు. అవస్థ పడి అమృతంలాగా భోజనం తయారు చేసి అందరికీ వడ్డించి, తర్వాత తింటారు చాలామంది ఇల్లాండ్రు.

అందువల్లనే "*అన్నం అడిగేవారే గానీ, అడ్డిగ అందించే వారెవరూ ఉండరు.*" అనే శాస్త్రం కూడా ఉంది మనకు. అన్ని వస్తువులు తామే సంతరించుకుని, సకాలంలో అన్నదానం చెయ్యాలనే ఆపేక్షతో అవస్థపడుతూ ఉంటారు స్త్రీలు.

అయితే కొందరు వంటింట్లో చేరడమే గాని - వంట మాత్రం ఎంతసేపటికీ అవదు. ఇంట్లో వాళ్ళు ఆకలి ఆకలు అని కేకలు పెడుతుంటే - 'అవుతోంది, అవుతోంది. అన్నం మెత్తపడుతోంది' అంటూ జవాబు మాత్రం ఎప్పటికప్పుడు అందిస్తూ ఉంటారు వంటింట్లో నుంచి.

పరాయివాడెవడో భోజనం కోసం వచ్చి "గృహిణి చిత్తం" అని వాకిట్లో కూర్చున్నట్లుగా కూర్చోవాలి యజమానికూడా! "ఏం! ఎంతవరకొచ్చింది! శోష వస్తోంది" అని చెప్పుకున్నా - ఆమెగారికి తొందర పుట్టదు. "ఫలహారం చేశారుగా - అలా పసిపిల్లవాడిలాగా గొడవ చేస్తారేం! కూర మగ్గుతోంది. పచ్చడి నూరి కేకేస్తా.. నాకు మాత్రం వంటింట్లో పడివుండాలని సరదా ఏమిటి? ఎప్పుడు నడుం వాల్చుకుందామా? అని ఉంది" - అని జవాబు.

చివరకు ప్రొద్దు పడమర వ్రాలి - భర్త మంచం మీద తూర్పుకు తిరిగి లోలోపల దైవాన్ని ప్రార్థిస్తుండగా.. "పది నిముషాల్లో లేవవచ్చు. అన్నం నైవేద్యం పెట్టడం వడ్డించడం" అని సువార్త వినిపిస్తుంది.

ఇంటివారిని బట్టే *"కాకి కూయగా లేచి, కాటుక మాదిరిగా అన్నం, కాకరకాయ మిరియం(అంటే తెగమాడ్చి) చేసి, పసువులొచ్చే వేళకు (అసలు సందెవేళకు) పరుగెత్తి పరుగెత్తి వడ్డించిందట"* - అనే సామెత

పాపం, ఈ ఇల్లాలిలో కూడా ఒక సుగుణం ఉంది. ఎంత ఆలస్యం చేసిన వడ్డన మాత్రం అతి చురుకుగా లేడిలాగా చిందులు వేస్తూ వడ్డిస్తుంది. ఆ చిందులూ, వయ్యారం చూసి చేసుకున్న వాడు - ఆకలితో మధ్యాహ్నం నుంచి పడ్డ బాధ మరచిపోతాడు.

దుర్వ్యసనాలలో చిక్కుకున్నవారు చిన్న చూపు చూడటం సహజం. ఇంటి విషయం పట్టించుకుంటే వ్యసనాలకు సొమ్ము ఉండదు. అందువల్ల వాటికోసమే ఉన్న సొమ్మంతా తగలబెడతాడు. మళ్ళీ అక్కడ మోజు తగ్గకూడదు. ఖర్చుకు లోపించకూడదు. జీవితాన్ని నాశనం చేసే కల్లు - చిప్పలో తాగితేనేం, దొప్పలో త్రాగితేనేం? కానీ దానికి మాత్రం కళాయి ఉండాల్సి ఆపేక్ష - వారిని జీవితాలను చక్కగా వర్ణించే సామెత ఇది - *"కాలు కడుగ ముంత లేదు - కల్లు త్రాగడానికి కళాయి గిన్నె"* అనేది.

వ్యసనాలకు లోనైన వాళ్ళందరూ ఇలాటి షోకులకు పోయి - సంసారాన్ని సన్యాసి మఠంగా మార్చివేస్తారు.. ఉన్న కాస్త సుఖాన్ని దూసివేస్తారు. ఇల్లాలికీ, పిల్లలకూ రవ్వంత వెలుతురు అందకుండా అన్ని కిటికీలు మూసివేస్తారు. సంఘ ద్రోహుల్ని లెక్క వేసుకుంటూ ఉంటాం గానీ - సంసార ద్రోహులెంతమందో ఉంటారు. వారిని ఎలా శిక్షించాలో తెలియదు - ఎవరు శిక్షిస్తారో తెలియదు.

పాపం చెయ్యడానికి వెనుకపడమంటూ ఉండదు. అని అలా నిర్వహిస్తూనే పోవాలి. కానీ వాటిని క్షాళన చేయడానికి దేవుడి దగ్గర దీపాలు వెలిగిస్తూ ఉండాలి. ఒకటి ఎక్కువ వెలిగించానని సంతోషించడానికి తావు ఉండదు. ఎందువల్లనంటే - ఎన్ని దీపాలు వెలిగించినా పాపాల చీకటిని పారద్రోలలేవు. అవి ఆపితేగా - ఇవి లెక్కలోకి వచ్చేది.

ఎంత పాపం చేసినా ఆపి దీపాలు వెలిగిస్తే - ఆ దేవుడు కరుణిస్తే కొంత పుణ్యం అందుకునే అవకాశం ఉంటుంది. అవి ఆపడం శక్యం కాదు.. అందువల్ల ఎన్ని దీపాలు వెలిగించినా చాలవు. ఒకవేళ ఎక్కువ వెలిగిస్తే - పాపానికి సరిపడ్డన్ని అవుతాయి అక్కడికి చాలా మేలే.

అంటే ఏమన్నమాట *"పాపాలు చేస్తూ ఉండటం.. దీపాలు వెలిగిస్తూ ఉండటం."* ఇది కొని జీవితాలలో జరిగే తమాషా!... ఎక్కడ తగ్గుతుందా హృదయంలో ఘోష?

Comment on this article..